# కష్టపడి పనిచేస్తే ఫలితం మనదే..

**ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల**

బోనకల్లు, జనవరి 11 : స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఇప్పటినుంచే కష్టపడి పనిచేస్తే మంచి ఫలితం దక్కుతుందని ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు అన్నారు. రావినూతల గ్రామంలో మాజీ సర్పంచ్ కొమ్మినేని ఉపేంద్ర నివాసంలో మండల పార్టీ సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారన్నారు. రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, మహిళలకు రూ.2,500 పెన్షన్ ఇస్తామని నేటికీ ఇవ్వకపోవడం ఈ వ్యతిరేకతకు ప్రధాన కారణమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీతో కలిసొచ్చే పార్టీలను కలుపుకొని అత్యధిక స్థానాల్లో గెలుపొందడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గత కేసీఆర్ పదేళ్ల పాలన, నేటి రేవంత్‌రెడ్డి పాలనపై వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా పార్టీ అంతర్గత వివరాలు, సమస్యలపై చర్చించారు. అనంతరం రైలు ప్రమాదంలో మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్త జర్పుల నాగేంద్రబాబు భార్య పోలికకు రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. సమావేశంలో మధిర మార్కెట్ మాజీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ బానోతు కొండ, రైతుబంధు మాజీ కన్వీనర్ వేమూరి ప్రసాద్, ఎస్సీ సెల్ నాయకుడు గద్దల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

---

***సంక్రాంతి సంబురాలకు ప్రజలు సిద్ధమయ్యారు. కన్నతల్లి లాంటి సొంతూరులో పండుగ జరుపుకునేందుకు పట్టణాల నుంచి పల్లెలకు చేరుకుంటున్నారు. అన్ని దారులు పల్లెల వైపే కదులుతున్నాయి. ఆరురోజుల సెలవులు కలిసిరావడంతో కుటుంబసమేతంగా పల్లెలకు పరుగులు పెడుతున్నారు. దీంతో బస్సులు, రైళ్ల ప్రాంగణాలు కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్ వంటి ప్రధాన నగరం నుంచి రావడానికి సరిపడా బస్సులు లేక పోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. పిండివంటల ఘుమఘుమలు, ఇళ్ల అలంకరణలతో ఊళ్లల్లో పండుగ శోభ ఉట్టిపడుతున్నది. మూడ్రోజుల పండుగను మది నిండుగా జరుపుకునేందుకు సర్వం సిద్ధమైంది.***

***- భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 11 (నమస్తే తెలంగాణ)***

- సంక్రాంతి సంబురాలకు సర్వం సిద్ధం
- సొంత ఊళ్లకు చేరుకుంటున్న ప్రజలు
- కిక్కిరిస్తున్న ప్రయాణ ప్రాంగణాలు
- సరిపడా బస్సుల్లేక ఇబ్బందులు
- పల్లెల్లో ఉట్టిపడుతున్న పండుగ శోభ

# పల్లెకు పోదాం.. పండుగ చేద్దాం..




సంక్రాంతి పండుగకు దారులన్నీ పల్లెల వైపే పరుగులు పెడుతున్నాయి. పండుగకు ఆరురోజుల సెలవులు కలిసిరావడంతో దూరప్రాంతం నుంచి బంధువులందరూ పల్లెలకు పరుగెడుతున్నారు. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు బస్సులు దొరక్క ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నది. మరోవైపు మహిళలకు ఉచిత బస్సులు ఉండడంతో బస్సులన్నీ మహిళలతో కిక్కిరిసిపోయాయి. మగవాళ్లకు బస్సులు లేక తలోదారి అవుతున్నారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు పుట్టిన ఊరులో జరిగే సంబురాలకు రెడీ అయిపోతున్నారు. ఒకవైపు కోళ్లపందేలు, మరోవైపు ఏడాదికి ఒకసారి కలుసుకునే అవకాశాలు రెండూ కలిసి రావడంతో ఏటా పట్నంవాసులు పల్లెలకు పరుగెత్తడం ఆనవాయితీగా మారింది.

### పండుగకు ఇదీ లెక్క...

ఎక్కడున్నామన్నది కాదు.. ఎక్కడ పుట్టామన్నది లెక్క.. పుట్టిన ఊరును కన్నతల్లిని ఎవరూ మరచిపోరు.. అలాంటి కన్నఊరు సంక్రాంతి పండుగ ప్రతి ఏటా పట్నంవాసులకు మధుర జ్ఞాపకాలను మిగుల్చుతుంది. బతుకుదెరువు కోసం పట్నం వెళ్లినా పల్లె సంస్కృతి మదిలోనే మెదులుతూ ఉంటుంది. చదువుకున్న రోజులు.. స్నేహితులతో ఆడుకున్న ఆటలు, వచ్చీరాని పాటలు, అమ్మమ్మలు, నాన్నమ్మలు తాతయ్యలతో సరదాగా చెప్పిన కబుర్లు గుర్తుకురావడంతో మనసులో గూడు కట్టుకున్న ఆనందోత్సాహం మనిషి మనసును పులకింపజేస్తుంది. అంతటి సరదాను అందరితో పంచుకోవడం కోసం పల్లెకు వెళ్లాల్సిందే మరి. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడకు వెళ్లినా సంక్రాంతి పండుగ తాలూకా కబుర్లు చెప్పుకుంటారు. అలాంటి సరదాను పంచుకోవడం కోసం పట్నంవాసులు పల్లెలకు పరుగెడుతున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాల పల్లెల్లో బంధువులతో గడపడానికి సిద్ధమయ్యారు. నెల రోజుల ముందుగానే బస్సులు, రైళ్లకు రిజర్వేషన్లు చేసుకుని సిటీ తీపిని పల్లెల్లో ఉన్న అమ్మానాన్నలకు తినిపించేందుకు పయనమయ్యారు. గత వారంరోజుల నుంచి బస్సులు, రైళ్లు ప్రయాణికులతో రద్దీగా మారాయి. ప్రైవేటు ట్రావెల్స్ సైతం బిజీ అయిపోయాయి.

### పల్లెలకు సంక్రాంతి శోభ...

పల్లెలు సంక్రాంతి శోభను సంతరించుకుంటున్నాయి. ఏ పల్లె చూసినా పందెంకోళ్ల కూతలు, సైకిల్ కనబడే రహదారుపై కార్ల హారన్‌లు, తాటిచెట్ల కింద సరదాగా ముచ్చట్లు చెప్పుకునే దోస్తులు, తాతముత్తాల పిల్లలతో బంధువుల ఇళ్ల వద్ద సందడిగా మారనున్నాయి. ఎన్నాళ్లకి తాగామురా మన పాడి ఆవుల పాలు, మజ్జిగ అంటూ ఎంజాయ్ చేస్తూ రోడ్లపై సందడిగా కనిపించే పాతమిత్రులను చూసి ముసలోళ్ల సంతోషం అంతాఇంతా కాదు. మరోవైపు పిండి వంటకాలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడుతున్నాయి.




కొత్తగూడెం, పాల్వంచ బస్టాండ్లలో కిక్కిరిసిన ప్రయాణికులు, బస్సుల కోసం ఎదురుచూపులు

### కిక్కిరిసిన బస్సులు, ప్రైవేటు వాహనాలు

సంక్రాంతి పండుగకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాయి. కానీ.. అవి ప్రయాణికులకు సరిపోవడం లేదు. అయినా రద్దీ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. నెలరోజుల ముందు నుంచే రిజర్వేషన్లు చేయించుకుని పట్నం నుంచి ప్రయాణికులు ప్రయాణమవుతున్నారు. దాంతో ఖమ్మం వరకు నడుస్తున్న రైళ్లు, బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ప్రైవేటు బస్సులు కూడా ఖాళీ లేకుండా ఉన్నాయి. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఈ పండుగకు మరింత కళను తెచ్చిపెట్టనుంది. ప్రత్యేక బస్సులను కూడా మహిళలకు ఉచితమే అని చెప్పడంతో ఆడబిడ్డలు పల్లెలకు పయనమవుతున్నారు. ఆర్టీసీ అదనంగా బస్సులు వేసినా ప్రయాణికుల రద్దీ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఇదే అదునుగా ఆర్టీసీ డైరెక్ట్ సర్వీసులను వేసి అధికరేట్లను వసూళ్లు చేస్తున్నది. ముక్కోటికి కూడా ప్రత్యేక బస్సులను నడపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంక్రాంతికి కూడా అదే పరిస్థితి కొనసాగుతున్నది.

---

## బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడికి ఖండన


తాతా మధుసూదన్


వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, జనవరి 11 : యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శనివారం వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి కాంగ్రెస్ నాయకుల విధానాలను, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించినందుకు కాంగ్రెస్ మంత్రులు దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక దాడుల విష సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ ప్రశాంతంగా ఉంటే కాంగ్రెస్ ఏడాది పాలనలో అశాంతి, అలజడి నెలకొందన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిచేసిన వారిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని, ఇలాంటి దాడులు పునరావృతమైతే చూస్తూ ఊరుకునేది లేదని తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

---

- **26 నుంచి నాలుగు కొత్త పథకాలు అమలు**
- **ప్రభుత్వ పథకాల అమలుపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీక్ష**

## పథకాల అమలుకు పటిష్ట కార్యాచరణ

మామిళ్లగూడెం, జనవరి 11 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్.. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు తదితర అంశాలపై సంబంధిత జిల్లా అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి పై నాలుగు పథకాలు ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రతీ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వ్యవసాయ విస్తరణాధికారి, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఇళ్లు, కాలనీలుగా మారిన భూములు, రియల్ ఎస్టేట్ లే అవుట్, రోడ్లుగా మారిన భూములు, వ్యవసాయానికి పనికి రాని అన్ని భూములను జాబితా నుంచి తొలగించి ప్రతీ ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా అమలు చేయాలని అధికారులకు సూచించారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున.. ఒక్కో విడతకు రూ.6 వేల చొప్పున రెండు విడతలుగా అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రారంభించనున్నదని తెలిపారు. జిల్లాలో 20 రోజులు ఉపాధిహామీ కూలీలుగా పనిచేసిన కార్మికుల జాబితాను తీసుకుని ఆధార్ కార్డు ట్యాగ్ ప్రకారం పరిశీలిస్తూ భూమి లేని కుటుంబాలను ఎంపిక చేయాలని సూచించారు. అర్హుల జాబితాను గ్రామాలవారీగా సిద్ధం చేయాలని, ఆయా వివరాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రికి అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, డీఎస్‌వో చందన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

---


ధాన్యం ఆరబోస్తున్న రైతు

# బోనస్.. తుస్..!

- **45,500 క్వింటాళ్ల ధాన్యానికి.. 10,500 క్వింటాళ్లకే బోనస్**
- **లబోదిబోమంటున్న ధాన్యం విక్రయించిన రైతులు**
- **పండుగ నాటికి ఇస్తారో? లేదో? అని ఎదురుచూపులు**

దుమ్ముగూడెం, జనవరి 11 : రైతుకు క్వింటా ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు నీటిమూటలయ్యాయని అన్నదాతలు మండిపడుతున్నారు. దుమ్ముగూడెం మండలంలో 45,500 క్వింటాళ్ల ధాన్యానికి.. 10,500 క్వింటాళ్లకే బోనస్ అందిందని, మిగతా రైతులకు అందలేదని వాపోతున్నారు. మండలవ్యాప్తంగా 130 లారీల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు. ఒక్కో లారీకి 350 క్వింటాళ్ల చొప్పున ధాన్యం వస్తుండటంతో సుమారు 130 లారీల ధాన్యం అంటే.. 45,500 క్వింటాళ్లను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. అయితే అందులో 10,500 క్వింటాళ్లకు మాత్రమే బోనస్ అందిందని, మిగిలిన రైతులకు అందలేదని అన్నదాతలు వాపోతున్నారు. మండలంలోని సహకార సంఘాల ద్వారా నర్సాపురం, సీతారాంపురం, ములకపాడు, దుమ్ముగూడెం, బైరాగులపాడు, కె.లక్ష్మీపురం, గోవిందాపురం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఉండగా.. వీటి ద్వారా 95 లారీల ధాన్యం ఎగుమతి చేశారు. అలాగే జీసీసీ ఆధ్వర్యంలో చిన్నబండిరేవులో 6, చిన్ననల్లబల్లి 18, మహాదేవపురం ఏడు, మారాయిగూడెంలో మూడు.. మొత్తం 34 లారీల ధాన్యాన్ని ఎగుమతి చేశారు. ఇదిలా ఉండగా.. సహకార సంఘం ద్వారా 105 లారీల ధాన్యం ఎగుమతి చేయగా.. రెండు లారీల ధాన్యానికే బోనస్ పడింది. మిగతా 103 లారీల ధాన్యానికి ఇంకా రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమకాలేదు. ఏదేమైనా వారం రోజుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే బోనస్ మినహాయించి నగదు జమ అవుతున్నదని రైతులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగ నాటికైనా బోనస్ డబ్బులు తమ ఖాతాల్లో జమ అవుతాయా? లేదా? అనే సందిగ్ధంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. దీనిపై సొసైటీ సీఈవో హిమబిందును వివరణ కోరగా.. రెండు లారీల ధాన్యానికే బోనస్ పడిందని, మిగిలిన వారికి త్వరలోనే పడుతుందని తెలిపారు. అలాగే జీసీసీ మేనేజర్ జయరావును వివరణ కోరగా.. ధాన్యం విక్రయించిన రైతులకు దఫా దఫాలుగా బోనస్ డబ్బులు జమ అవుతాయని చెప్పడం కొసమెరుపు.

### బోనస్ ఇంకా పడలేదు..



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల వరి ధాన్యానికి బోనస్‌గా రూ.500 ఇస్తామని ప్రకటించింది. 20 రోజులు ధాన్యం ఆరబెట్టి విక్రయించినా ఇప్పటివరకు బోనస్ నా ఖాతాలో జమ కాలేదు. ఈ ధాన్యాన్ని పది రోజులు ఆరబెట్టి బయటి దళారులకు విక్రయిస్తే వెంటనే నగదు ఇచ్చేవారు. 20 రోజులు పంటను ఆరబెట్టి విక్రయించి రెండు నెలలైనా నేటికీ బోనస్ జమ కాలేదు. ఏం చేయాలో అర్థం కావట్లేదు.

**– కొండల వెంకటేశ్వరరెడ్డి, రైతు, రామకృష్ణాపురం, దుమ్ముగూడెం మండలం**

---

# వైరా రిజిస్ట్రేషన్లపై కదులుతున్న డొంక

- **విచారణ కమిటీ వేసిన మంత్రి పొంగులేటి**
- **వైరా సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు? జిల్లా రిజిస్ట్రార్‌పై బదిలీ వేటు?**




ఖమ్మం, జనవరి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వైరా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగిన మూకుమ్మడి అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం రిజిస్ట్రేషన్ శాఖలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. ఒకే వెంచర్‌కు సంబంధించి 64 రిజిస్ట్రేషన్ల ద్వారా సుమారు 50 వేల గజాల స్థిరాస్తిని నిబంధనలు తుంగలోకి తొక్కి రిజిస్ట్రేషన్ చేసిన తీరు శనివారం 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో రావడంతో ఈ వ్యవహారంపై అధికారులు పూర్తిస్థాయి దృష్టి సారించారు. వైరాలో జరిగిన మూకుమ్మడి రిజిస్ట్రేషన్లలో నిబంధనలు పాటించని వ్యవహారం తన దృష్టికి సైతం వచ్చిందని, దీనిపై శాఖాపరమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఖమ్మంలో జరిగిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి, అక్రమాలను సహించేది లేదని, రాష్ట్రస్థాయిలో ప్రక్షాళన జరుపుతామని వెల్లడించారు. ఇక వైరా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం అధికారుల మెడకు చుట్టుకోనున్నట్లు తెలుస్తున్నది. లే అవుట్, ఎల్‌ఆర్ఎస్ నిబంధనలను పక్కకు పెట్టి కొన్నింటికి మాత్రమే లే అవుట్, ఎల్‌ఆర్‌ఎస్‌లు ఉన్నా అన్ని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయడం నిబంధనలకు విరుద్ధమని ఉన్నతాధికారులు తప్పుబట్టినట్లు తెలుస్తున్నది. జీపీఏ ఉన్న వ్యక్తికి ఏ సంబంధం లేకుండా, జీపీఏ రద్దు కాకుండా అర్ధరాత్రి వరకు మూకుమ్మడి రిజిస్ట్రేషన్లు చేయాల్సిన అవసరం ఏమిటని వైరా సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్యపై రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ బుద్ధప్రకాశ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి ఆదేశాల మేరకు వైరా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లపై ఉన్నతాధికారులతో విచారణ కమిటీని నియమించారు. వరుసగా సెలవులు రావడంతో పండుగ అనంతరం విచారణ కమిటీ వైరా రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్ట్రేషన్ల వ్యవహారం, నిబంధనలను తుంగలోకి తొక్కిన తీరును పరిశీలించనుంది.

### అధికారులపై బదిలీ వేటు?

ఇక ఉన్నతాధికారులకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా ఒకే వెంచర్‌కు సంబంధించి 64 రిజిస్ట్రేషన్ల ద్వారా సుమారు 50 వేల గజాల స్థిరాస్తిని రిజిస్ట్రేషన్ చేయడం అధికారులకు ఆగ్రహం తెప్పిస్తున్నది. ఈ భూమిపై జీపీఏ కలిగిన వ్యక్తి రాష్ట్ర రెవెన్యూ మంత్రికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనను అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. రిజిస్ట్రేషన్లను అర్ధరాత్రి 2 గంటల వరకు చేయాల్సిన అవసరం ఏమిటంటూ ప్రశ్నించిన రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఇందుకు బాధ్యులను చేస్తూ వైరా సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్యపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తున్నది. ఈ మేరకు ఉన్నతాధికారుల నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అయితే వరుసగా సెలవులు రావడంతో రామచంద్రయ్యకు అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు అందాల్సి ఉంది. ఇక రిజిస్ట్రార్ కార్యాలయాలను రిజిస్ట్రేషన్లు నిబంధనలకు అనుగుణంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాల్సిన జిల్లా రిజిస్ట్రార్ నిర్లక్ష్యంగా వ్యవహరించి, సమన్వయం చేసుకోలేకపోయారని, ఈ మొత్తం వ్యవహారాన్ని ఉన్నతాధికారులకు సకాలంలో నివేదించలేదన్న కారణంతో ఆయనపై సైతం క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జిల్లా రిజిస్ట్రార్‌పై బదిలీ వేటు వేసేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తున్నది. మూకుమ్మడి రిజిస్ట్రేషన్ల వ్యవహారం ప్రచార సాధనాల ద్వారా వెలుగులోకి రావడంతో జీపీఏకి చెందిన వ్యక్తికి సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులు ఈ వ్యవహారాన్ని సద్దుమణిచేందుకు అధికార పార్టీ నేతల ద్వారా ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ 64 రిజిస్ట్రేషన్లలో 10 ప్లాట్లకు సంబంధించి డబుల్ రిజిస్ట్రేషన్ చేయడం, దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడంపై సంబంధిత అధికారులను రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు మందలించినట్లు తెలుస్తున్నది.

---

## మా ఊరికి మేము సైతం..

- **పూబెల్లి పర్యాటకాభివృద్ధికి చేయి చేయి కలిపారు..**
- **చెరువు ప్రాంతంలో శ్రమదానం చేసిన గ్రామస్తులు**


పొక్లెయిన్‌తో శుభ్రం చేసుకుంటున్న గ్రామస్తులు

ఇల్లెందు రూరల్, జనవరి 11 : పూబెల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు అడుగులు పడుతున్న తరుణంలోనే ఆ ఊరి ప్రజలు మేము సైతం అంటూ ముందుకొచ్చారు. తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు దండగుండాల, పూబెల్లి గ్రామస్తులు శనివారం నడుం బిగించారు. పర్యాటకంగా అభివృద్ధి చేయనున్న చెరువు పరిసరాల్లో పొక్లెయిన్ సహాయంతో చెత్త, రాళ్లను తొలగించగా.. మహిళలు, యువతీ యువకులు శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఇందులో వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొని తమ వంతు పాత్ర పోషించారు. అయితే కొద్దిరోజుల క్రితం ఇల్లెందు మండలం పూబెల్లి గ్రామాన్ని సందర్శించిన భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అక్కడి పరిసరాలను పరిశీలించారు. ఇక్కడి చెరువు, చుట్టుపక్కల ప్రాంతాలను కలియతిరిగి పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే నిర్ణయించారు. దీనిని అభివృద్ధి చేస్తే పర్యాటకుల రద్దీ పెరగడంతోపాటు ఇక్కడి యువతకు జీవనోపాధి లభిస్తుందని గ్రామస్తులకు పరిస్థితిని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటీవల అధికారులు గ్రామసభ నిర్వహించి గ్రామస్తుల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు సేకరించారు. ఈ క్రమంలోనే గ్రామస్తులు ముందస్తుగా తమవంతుగా శ్రమదానం చేశారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసుకునేందుకు మా వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని చేయి చేయి కలిపి చూపించారు.